AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

WWW.AKSHARATODAY.IN

28-4-2026 (Tuesday) MAIN EDITION

## రేపే పదో తరగతి పరీక్ష ఫలితాలు




**అక్షరటుడే, హైదరాబాద్ :** తెలంగాణలో పదో తరగతి ఫలితాల విడుదలపై క్లారిటీ వచ్చింది. లక్షలాది మంది విద్యార్థులు ఫలితాల కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ఫలితాలు విడుదల చేయనున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ఎన్నడు లేని విధంగా ఈ సారి నెల రోజుల పాటు పదో తరగతి పరీక్షలు నిర్వహించారు. మార్చి 14న ప్రారంభమైన ఎగ్జామ్స్ ఏప్రిల్ 13న ముగిశాయి. మొత్తం 5.15 లక్షల మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు అయ్యారు.

## రక్షణ రంగ వ్యయంలో భారత్ నయా రికార్డు



**అక్షరటుడే, న్యూఢిల్లీ:** గ్లోబల్ డిఫెన్స్ మార్కెట్‌లో భారత్ తన బలాన్ని మరింత పెంచుకుంది. ప్రపంచవ్యాప్తంగా రక్షణ రంగంపై అత్యధికంగా ఖర్చు చేస్తున్న దేశాల జాబితాలో భారత్ ఐదో స్థానాన్ని దక్కించుకుంది. ప్రముఖ పరిశోధక సంస్థ 'సిప్రి' విడుదల చేసిన 2025 నివేదిక ఈ ఆసక్తికర విషయాలను వెల్లడించింది. గత ఏడాదితో పోలిస్తే భారత్ తన సైనిక వ్యయాన్ని భారీగా పెంచింది. 2025లో మన దేశం రక్షణ రంగం కోసం 92.1 బిలియన్ డాలర్లను ఖర్చు చేసింది.

### మా సీసీ కెమెరాలు హ్యాక్ చేస్తున్నారు : హరీశ్‌రావు




అక్షరటుడే, సంగారెడ్డి: మాజీ మంత్రి హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ ముఖ్య నాయకుల ఇళ్లు, కార్యాలయాల వద్ద ఉన్న సీసీ కెమెరాలు హ్యాక్ చేయిస్తున్నారని ఆరోపించారు. కొందరు ఐపీఎస్ అధికారులు తమ ఫోన్లు, ఇళ్ల ముందు ఉన్న సీసీ కెమెరాలు హ్యాక్ చేస్తున్నారని ఆరోపించారు.

### పైలెట్ రోహిత్ రెడ్డికి బెయిల్



అక్షరటుడే, హైదరాబాద్: మొయినాబాద్ ఫామ్‌హౌస్ డ్రగ్స్ కేసులో తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డికి హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ప్రతిరోజూ దర్యాప్తు అధికారి ఎదుట హాజరుకావాలని స్పష్టం చేసింది. తన పాస్‌పోర్టును పోలీసులకు అప్పగించాలని కోర్టు ఆదేశించింది.

### ఆర్గానిక్ స్టేట్‌గా సిక్కిం : మోదీ



అక్షరటుడే, నేషనల్ డెస్క్: ప్రకృతి, సంస్కృతి కలగలిసిన ప్రాంతం సిక్కిం అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. సిక్కిం రాష్ట్ర ఏర్పాటుకు 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జరిగిన స్వర్ణోత్సవ వేడుకల్లో మాట్లాడారు. ఆ రాష్ట్రాన్ని తూర్పు స్వర్గంగా అభివర్ణించారు. సిక్కిం ఆర్గానిక్ స్టేట్‌గా రూపాంధిందని కొనియాడారు.

## భారత్‌కు దావూద్ ఇబ్రహీం సన్నిహితుడు సలీం డోలా..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** దావూద్ ఇబ్రహీంకు అత్యంత సన్నిహితుడైన సలీం డోలాను భారతదేశానికి తీసుకువచ్చారు. అతడిని టర్కీలో అరెస్ట్ చేయగా.. ఆ దేశం భారత్‌కు అప్పగించింది. దీంతో మంగళవారం ఉదయం ఢిల్లీలోని ఒక టెక్నికల్ విమానాశ్రయంలో దిగాడు. అంతర్జాతీయ ఏజెన్సీల సహకారంతో నిఘా సంస్థలు సమన్వయంతో నిర్వహించిన ఆపరేషన్ తర్వాత ఈ అప్పగింత జరిగింది. ఈ ఉదయం అతడిని ఒక ప్రత్యేక విమానంలో తీసుకువచ్చారు. ప్రస్తుతం అతడిని అధికారులు విచారిస్తున్నారు. తదుపరి విచారణ కోసం అతడిని ముంబై పోలీసులకు అప్పగించే అవకాశం ఉంది.

**బీఆర్ఎస్‌లో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు గులాబీ బాస్ కేసీఆర్ మరిన్ని బాధ్యతలు అప్పగించారు. రెండు దశాబ్దాలకు పైగా పార్టీని ఏకఛత్రాధిపత్యంగా నడిపించిన బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, ఇప్పుడు తన వారసుడు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావుకు పార్టీ పగ్గాలను దాదాపు అప్పగించారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గానే కాకుండా, పార్టీకి సంబంధించిన ప్రతి కీలక నిర్ణయంలోనూ కేటీఆరే సుప్రీం అనే స్పష్టమైన సంకేతాలు శ్రేణులకు అందాయి.**

**- అక్షరటుడే, హైదరాబాద్**



# కేటీఆర్‌కు పార్టీ పగ్గాలు!

- బీఆర్ఎస్ సుప్రీం లీడర్‌గా కేటీఆర్‌కు గ్రీన్ సిగ్నల్
- ఆవిర్భావ వేడుకల్లో కీలక బాధ్యతలు అప్పగించిన కేసీఆర్
- నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ

రాష్ట్రంలో మారుతున్న రాజకీయ సమీకరణాల దృష్ట్యా కేసీఆర్ ఒక వ్యూహాత్మక నిర్ణయం తీసుకున్నారు. ఆయన ఇకపై కేవలం మార్గనిర్దేశకుడిగా ఉంటూ, జాతీయ రాజకీయాలు , రాష్ట్రస్థాయి విధానపరమైన నిర్ణయాలకే పరిమితం కానున్నారు. పార్టీ దైనందిన నిర్వహణ, నియోజకవర్గాల వారీగా క్షేత్రస్థాయి సమీక్షలు, కేడర్‌ను సమాయత్తం చేయడం, ఎన్నికల వ్యూహరచన వంటి పూర్తి బాధ్యతలను కేటీఆర్ భుజాన వేశారు. దీంతో పార్టీలో అధికార కేంద్రీకరణ కేటీఆర్ వద్దే ఉంటుందని, ఆయన మాటే ఫైనల్ అని స్పష్టమైంది.

### పార్టీకి పూర్వవైభవం దిశగా

రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న రాజకీయ వాతావరణంలో పార్టీని మళ్లీ గాడిలో పెట్టేందుకు కేటీఆర్ దూకుడు, ఆయన వాగ్ధాటి అత్యవసరమని అధిష్ఠానం భావిస్తోంది. సోషల్ మీడియాలో బలమైన పట్టు, యువతను ఆకర్షించే శైలి కలిగిన కేటీఆర్ నాయకత్వం పార్టీకి పూర్వవైభవం తెస్తుందని కార్యకర్తలు ఆశిస్తున్నారు. రాబోయే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు సహా, జీహెచ్ఎంసీ ఎన్నికల వరకు అభ్యర్థుల ఎంపిక, ప్రచార సరళి అంతా కేటీఆర్ మార్క్ వ్యూహాలతోనే సాగనుంది.

### ముందున్న సవాళ్లు..

పార్టీ సర్వాధికారిగా బాధ్యతలు చేపట్టిన కేటీఆర్ ముందు అనేక సవాళ్లు ఉన్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీ ఎత్తుగడలను సమర్థవంతంగా తిప్పికొట్టడం, చేజారిన ముఖ్య నేతలను తిరిగి పార్టీలోకి రప్పించడం, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడం ఇప్పుడు ఆయన ప్రాధాన్యతలు. ఇందుకోసం కేటీఆర్ 'ఆపరేషన్ రీబిల్డ్' పేరుతో జిల్లాల పర్యటనలకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా పాదయాత్ర చేస్తానని కేటీఆర్ ఇది వరకే ప్రకటించారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల కేడర్‌ను రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు సమాయాత్తం చేస్తూ ఆయన నిర్ణయాలు ఉండనున్నాయి. ఇక ఈ ప్రయాణంలో బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు పాత్ర ఎలా ఉంటుందో వేచి చూడాలి. మొత్తానికి, బీఆర్ఎస్ అంటే కేసీఆర్ అనే ముద్ర నుంచి కేటీఆర్ అనే కొత్త అధ్యాయం మొదలైంది.

## ఫుట్‌బాల్ ఆడిన ప్రధాని మోదీ



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** సిక్కిం పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ అనుకోని విధంగా ఫుట్‌బాల్ మైదానంలో ప్రత్యక్షమై అందరినీ ఆశ్చర్యపరిచారు. గ్యాంగ్‌టక్‌లో పర్యటిస్తున్న సందర్భంగా అక్కడి స్థానిక యువతీ యువకులు ఫుట్‌బాల్ ఆడుతున్నట్టు గమనించిన ఆయన, వెంటనే వారివద్దకు వెళ్లి కాసేపు ముచ్చటించారు. యువతతో స్నేహపూర్వకంగా మాట్లాడిన మోదీ.. కొద్ది సేపటికి స్పోర్ట్స్ జెర్సీ ధరించి మైదానంలోకి దిగిన ప్రధాని, ఆటగాళ్లతో కలిసి సరదాగా ఫుట్‌బాల్ ఆడారు. ఆటలో చురుకుగా పాల్గొంటూ కొన్ని గోల్స్ కూడా కొట్టడం విశేషం. మోదీతో కలిసి ఆడిన యువత ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఈ అరుదైన క్షణాలను చూసేందుకు అక్కడి ప్రజలు పెద్ద ఎత్తున గుమిగూడారు. ఈ సందర్భంగా యువతతో క్రీడల ప్రాముఖ్యతపై కూడా మోదీ చర్చించినట్లు సమాచారం. శారీరక దారుఢ్యం, జట్టు భావన, క్రమశిక్షణ వంటి విలువలను క్రీడలు పెంపొందిస్తాయన్నారు.

## హైకోర్టును ఆశ్రయించిన నటి అషు రెడ్డి



**అక్షరటుడే, హైదరాబాద్:** బిగ్‌బాస్ ఫేమ్, నటి అషు రెడ్డి చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. పెళ్లి పేరుతో ఓ ప్రవాస భారతీయుడిని భారీ మొత్తంలో మోసం చేశారనే ఆరోపణలపై ఆమెపై హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ అషు రెడ్డి తాజాగా తెలంగాణ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. పోలీసులు తన వెర్షన్ తీసుకోకుండానే ఏకపక్షంగా కేసు నమోదు చేశారని అషు రెడ్డి తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

## గూగుల్ ఏఐ డేటా సెంటర్‌కు శంకుస్థాపన




**అక్షరటుడే, విశాఖ:** ప్రముఖ ఐటీ సంస్థ గూగుల్ ఏపీలోని విశాఖ పట్నంలో ఏర్పాటు చేయనున్న అతిపెద్ద మెగా డేటా సెంటర్, ఏఐ హబ్‌కు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో కలిసి సీఎం చంద్రబాబు మంగళవారం శంకుస్థాపన చేశారు. విశాఖ జిల్లా తర్లువాడలో భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. విశాఖను డేటా సెంటర్ హబ్‌గా మారుస్తామని గతంలో సీఎం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు గూగుల్ డేటా సెంటర్ కోసం విశాఖలోని మూడు ప్రాంతాల్లో భూమి కేటాయించారు. సుమారు రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడితో డేటా సెంటర్ నిర్మాణానికి గూగుల్ ముందుకు వచ్చింది. విశాఖ, అనకాపల్లి జిల్లాల పరిధిలో గిగావాట్‌కు పైగా సామర్థ్యంతో మూడు చోట్ల డేటాసెంటర్లు నిర్మించనుంది.

## ఇప్పటి వరకు ఒక లెక్క.. ఇక నుంచి మరో లెక్క: మంత్రి లోకేశ్



**అక్షరటుడే, విశాఖపట్నం:** ఆంధ్రప్రదేశ్ ఐటీ రంగ చరిత్రలో విశాఖ నగరం అంతర్జాతీయ స్థాయికి చేరిందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. విశాఖ జిల్లా తర్లువాడలో మంగళవారం ప్రతిష్ఠాత్మక గూగుల్ ఏఐ డేటా సెంటర్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో లోకేశ్ ఉద్వేగభరిత ప్రసంగం చేశారు. ఈ భూమి పూజ కేవలం ఒక భవన నిర్మాణానికి సంబంధించింది కాదని, ఏపీ అభివృద్ధిలో ఇదొక చారిత్రాత్మక ఘట్టమని లోకేశ్ అభివర్ణించారు. "ఇప్పటివరకు ఒక లెక్క.. ఇప్పటినుంచి మరో లెక్క.. ఇకపై గ్లోబల్ ఐటీ మ్యాప్‌లో విశాఖ పేరు మారుమోగుతుంది. వైజాగ్ అంటే ఇకపై గూగుల్ అనే శబ్దం వినిపిస్తుంది" అని ఆయన వ్యాఖ్యానించారు.

## కాశ్మీర్ కాదు హైదరాబాద్..



**హైదరాబాద్ నగరం కశ్మీర్‌ను తలపించింది. నగరంలోని ఓఆర్ఆర్ పై సోమవారం సాయంత్రం వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో వడగళ్లు సైతం పడ్డాయి. శంషాబాద్-నాదర్ గుల్ మధ్య ఔటర్ రింగ్ రోడ్డుపై కిలోమీటర్ల మేర మంచు పేరుకుపోయినట్లు వడగళ్లు కురిశాయి. హైదరాబాద్ నగరంలో మంచును చూడడంతో ప్రజలు షాక్ అయ్యారు. రోడ్డు పక్కన తమ వాహనాలను నిలిపి మంచులో ఎంజాయ్ చేశారు. ఫొటోలు, వీడియోలు తీసుకున్నారు.**

**- అక్షరటుడే, హైదరాబాద్**

## సమంతకు శుభాకాంక్షల వెల్లువ



**హీరోయిన్ సమంత పుట్టిన రోజు సందర్భంగా సినీ ప్రముఖులు, అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఆమె తన 39వ పుట్టిన రోజు నేడు జరుపుకుంటున్నారు. సోషల్ మీడియాలో సామ్ అభిమానులు బర్త్‌డే విషెస్ చెబుతున్నారు. హీరోయిన్లు అనన్య పాండే, నయనతార, నటి వరలక్ష్మి శుభాకాంక్షలు తెలిపారు. ఏ మాయే చేశావే సినిమాతో తెలుగు చిత్ర సీమలోకి అడుగు పెట్టిన ఆమె.. అనంతరం తనకంటూ ప్రత్యేక స్థానం దక్కించుకున్నారు.**

**– అక్షరటుడే, సినిమా డెస్క్**

## బుల్లెట్ రైళ్లతో నవశకం..:అశ్వినీ వైష్ణవ్



**అక్షరటుడే, విశాఖపట్నం:** బుల్లెట్ రైళ్ల రాకతో దక్షిణాది రాష్ట్రాల రవాణా ముఖచిత్రం పూర్తిగా మారిపోబోతోందని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. విశాఖపట్నంలో జరిగిన గూగుల్ ఏఐ డేటా సెంటర్ శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దక్షిణాదిలోని ప్రధాన నగరాలైన అమరావతి, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు మధ్య అద్భుతమైన కనెక్టివిటీ పెరగబోతోందని మంత్రి తెలిపారు. ఈ నగరాలను అనుసంధానిస్తూ 'హైస్పీడ్ డైమండ్' కారిడార్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రయాణ సమయం గణనీయంగా తగ్గడమే కాకుండా, ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థకు పెద్దపీట వేయవచ్చని పేర్కొన్నారు. "హైస్పీడ్ డైమండ్ ప్రాజెక్టు దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి పట్ల కేంద్ర ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు నిదర్శనం" అని మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టం చేశారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు సమాన అవకాశాలు కల్పిస్తోందన్నారు.

## సోదరి అస్థిపంజరంతో బ్యాంక్‌కు వెళ్లిన వ్యక్తి..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఓ వ్యక్తి తన సోదరి అస్థిపంజరంతో బ్యాంక్‌కు వెళ్లాడు. ఈ ఘటన ఒడిశాలోని కియోంఝర్ జిల్లాలో ఈ నెల 27న చోటు చేసుకుంది. దియానాలి గ్రామానికి చెందిన జితు ముండా సోదరి కాక్రా ముండాకు రెండు నెలల క్రితం చనిపోయింది. ఆమెకు మల్లిపాసిలోని ఒడిశా గ్రామీణ బ్యాంకులో ఖాతా ఉండేది. ఆ అకౌంట్‌లో రూ.19,300 డబ్బులు ఉన్నాయి. దీంతో ఆమె అకౌంట్‌లోని డబ్బుల కోసం జితు ముండా బ్యాంక్ అధికారులను కలిశాడు. దీంతో ఖాతాదారుడు తప్పనిసరిగా హాజరు కావాలని, లేదా అతను చట్టబద్ధమైన వారసత్వ పత్రాలను సమర్పించాలని మేనేజర్ డబ్బులు ఇవ్వడానికి నిరాకరించాడు. అతడి వద్ద డెత్ సర్టిఫికెట్, ఇతర వారసత్వ పత్రాలు లేవు. దీంతో తన సోదరి మరణించిందని రుజువు చూపడానికి ఆమెను పాతిపెట్టిన గోతిని తవ్వి మృతదేహాన్ని భుజాలపై మోసుకొని తీసుకెళ్లాడు.